
www.prajasakti.com
ప్రజాశక్తి
శనివారం 25 నవంబర్ 2023
5
వైఎస్ఆర్



రాజధాని తరలింపు నిర్ణయం చారిత్రాత్మక తప్పిదం

వేంపల్లె : ఉత్తరాంధ్ర అభివృద్ధి పేరుతో రాజధానిని అమరావతి నుంచి విశాఖకు తరలించాలని సిఎం జగన్ నిర్ణయం తీసుకోవడం చారిత్రాత్మక తప్పిదమని పిసిసి మీడియా ఛైర్మన్ తులసిరెడ్డి అన్నారు. శుక్రవారం వేంపల్లెలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ పంటి నొప్పికి తుంటి మీద తన్నినట్లుంది వైసిపి ప్రభుత్వం వైఖరి అన్నారు. ఉత్తరాంధ్ర ప్రజలు కోరుకుంటున్నది ఒకటి, వైసిపి ప్రభుత్వం చేస్తున్నది వేరొకటి అన్నారు. ప్రత్యేక హోదా అమలు, బుందేల్ ఖండ్ తరహాలో ప్రత్యేక అభివృద్ధి ప్యాకేజీ, విశాఖ రైల్వే జోన్, విశాఖ మెట్రో రైలు, ఉత్తరాంధ్ర సుజల స్రవంతి, విశాఖ - చెన్నై పారిశ్రామిక కారిడార్ కావాలని ప్రజలు కోరుకుంటున్నట్లు చెప్పారు. విశాఖ ఉక్కు కర్మాగారాన్ని అమ్మవద్దని, ప్రయివేటు పరం చేయవద్దని ప్రజలు కోరుతున్నారని చెప్పారు. రాజధాని అమరావతి నుంచి విశాఖకు తరలించి విశాఖను అశాంతి విశాఖ చేయవద్దని 90 శాతం ఉత్తరాంధ్ర ప్రజలు అభిప్రాయ పడుతున్నట్లు చెప్పారు.

అడుగంటిన ప్రాజెక్టులు

డెడ్ స్టోరేజీ దిశగా పరుగులు

33 టిఎంసిలకు పడిపోయిన వైనం

రోజురోజుకూ తగ్గుతున్న నీటి మట్టాలు

వేసవిలో తాగునీటికీ కటకటే..!

ఉమ్మడి జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టుల్లో జలసిరి అడుగంటిపోతోంది. జిఎన్ఎస్ఎస్, హెచ్ఎన్ఎస్ఎస్, తెలుగుగంగ, తుంగభద్ర ప్రాజెక్టుల పరిధిలో 11 సాగునీటి ప్రాజెక్టులు ఉన్నాయి. విభజిత జిల్లాల నేపథ్యంలో కడప జిల్లాలో 84 టిఎంసిలు నిల్వల్లో 33 టిఎంసిలకు పడిపోవడం ఆందోళన కలిగిస్తోంది. ఈ ఏడాది జూన్ నుంచి నవంబర్ వరకు ఆశించిన వర్షపాతం నమోదవని నేపథ్యంలో డెడ్ స్టోరేజీ దిశగా పరుగులు తీస్తుండడం ఆందోళన కలిగిస్తోంది. గండికోట, బ్రహ్మసాగర్, మైలవరం మినహా మిగిలిన ప్రాజెక్టులన్నీ తాగునీటి అవసరాలు తీర్చడానికి పరిమితమయ్యాయి. జిల్లాలోని ప్రాజెక్టులను సాగునీటి అవసరాలు తీర్చాలనే ఉద్దేశంతో నిర్మించిన సంగతి తెలిసిందే. ప్రతి ఏటా కృష్ణా జలాలు ఆశించిన మేర అందని నేపథ్యంలో తాగునీటి అవసరాలకు పరిమితమయ్యాయి. ప్రస్తుత తీవ్ర వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో వేసవిలో తాగునీటికి ఎద్దడి నెలకొనే అవకాశం ఉందనిపిస్తోందనే ఆందోళన వ్యక్తమవుతోంది.

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

ఉమ్మడి జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టుల పనుల్ని పూర్తి చేస్తే సుమారు 22 లక్షల ఎకరాలు సాగయ్యే అవకాశం ఉంది. జిల్లాలో కెసి కెనాల్ ప్రధాన సాగు నీటి వనరుగా నిలిచింది. రూ.వేలాది కోట్లతో నిర్మితమవుతున్న రిజర్వాయర్లు, ప్రాజెక్టుల ఆశించిన ప్రయోజనాలను నెరవేర్చడం లేదు. జిల్లాలోని 11 సాగునీటి ప్రాజెక్టుల్లో గండికోట, పైడిపాలెం, చిత్రావతి మినహా మిగిలిన ప్రాజెక్టులన్నీ డెడ్‌స్టోరేజీ దిశగా పరుగులు తీస్తుండడం ఆందోళన కలిగిస్తోంది. ఉమ్మడి జిల్లాలో గండికోట, బ్రహ్మసాగర్, మైలవరం, పైడిపాలెం, సర్వరాయసాగర్, ఎస్ఆర్-1, ఎస్ఆర్-2, అన్నమయ్య, వెలిగల్లు, చిత్రావతి, లోయర్‌సగిలేరు, ఎగువ సగిలేరు, బుగ్గవంక ప్రాజెక్టులను నిర్మించారు. కృష్ణాజలాలతోనే సాగునీటి ప్రాజెక్టులను సంతరింపచేస్తున్నారు. ఈ ఏడాది శ్రీశైలం రిజర్వాయర్‌కు నామమాత్రంగానైనా వరద ప్రవాహం లేకపోవడంతో కృష్ణాజలాలు ప్రశ్నార్థకంగా మారడం తెలిసిందే.

గండికోట రిజర్వాయర్ : 26.850 టిఎంసిల సామర్థ్యం కలిగి ఉంది. 13.857 టిఎంసిలు మాత్రమే నీరు నిల్వ ఉంది. పోతిరెడ్డిపాడు రెగ్యులేటర్ నుంచి సుమారు 106 కిలోమీటర్ల మేరకు గాలేరు-నగరి-1 దశలోని పనులు పూర్తి చేయాల్సి ఉంది. పనుల్ని పూర్తి చేయకపోవడంతో కృష్ణాజలాలు అందని మానిపడు చందంగా మారడం ఆందోళన కలిగిస్తోంది.

మైలవరం రిజర్వాయర్ : 9.960 టిఎంసిల సామర్థ్యంతో నిర్మితమైంది. 2.223 టిఎంసిల నీరు మాత్రమే నిల్వ ఉంది. సాగు నీటి అవసరాల నిమిత్తం ఏర్పాటు చేశారు. సప్లయ్ కెనాల్‌ను ఏర్పాటు చేయాలనే డిమాండ్ వినిపిస్తోంది.

చిత్రావతి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ : 10 టిఎంసిల సామర్థ్యంతో నిర్మితమైంది. 5.225 టిఎంసిలను కలిగి ఉంది. ప్రాజెక్టు డెడ్‌స్టోరేజీ దిశగా పయనిస్తోంది. వేసవి నాటికి తాగునీటి సరఫరాను సైతం అందించలేని దుస్థితికి చేరుకోనుంది.


బ్రహ్మసాగర్ రిజర్వాయర్‌లో తగ్గిన నీటి మట్టం

బ్రహ్మసాగర్ : 17.73 టిఎంసిల నిల్వ సామర్థ్యంతో నిర్మితమైంది. 4.158 టిఎంసిల నిల్వను కలిగి ఉంది. ఆరేటిపికే ఇవ్వాల్సిన 1.5 టిఎంసిలను మినహాయిస్తే తాగునీటి అవసరాలకు పరిమితం కానుందనే వాదన వినిపిస్తోంది. 1.75 లక్షల ఎకరాల ఆయకట్టు ఉంది.

పైడిపాలెం రిజర్వాయర్ : ఆరు టిఎంసిల నిల్వ సామర్థ్యంతో నిర్మితమైంది. 5.120 టిఎంసిలను కలిగి ఉండడం ఊరట కలిగిస్తోంది. సప్లయ్‌చానల్స్ లేకపోవడంతో నిండు కుండను పోలి ఉంటుంది.

సర్వరాయసాగర్ రిజర్వాయర్ : 3.060 టిఎంసిల నిల్వ సామర్థ్యంతో చేపట్టారు. 0.740 టిఎంసిలను కలిగి ఉంది.

వామికొండ సాగర్ : సర్వరాయసాగర్‌తో అనుసంధానించబడి ఉంది. 1.658 టిఎంసిల సామర్థ్యంతో నిర్మితమైంది. 1.371 టిఎంసిల నిల్వ ఉంది.

సబ్సిడరీ రిజర్వాయర్-1: తెలుగుగంగ ప్రాజెక్టులో అంతర్భాగమైన ఎస్ఆర్-1 2.135 టిఎంసిల సామర్థ్యంతో నీటి నిల్వను కలిగి ఉంది. 0.297 టిఎంసిల నిల్వ నీటిని కలిగి ఉంది. తాగునీటి అవసరాలకు మాత్రమే పరిమిత మవుతోంది.

సబ్సిడరీ రిజర్వాయర్-2 : తెలుగుగంగ ప్రాజెక్టులో అంతర్భాగమైన ఎస్ఆర్-2 2.447 టిఎంసిల నీటి నిల్వను కలిగి ఉంది. 0.699 టిఎంసిల నీటి నిల్వలను కలిగి ఉంది.

వెలిగల్లు ప్రాజెక్టు : 4.64 టిఎంసిల నీటి నిల్వ సామర్థ్యం కలిగి ఉంది. 3.154 టిఎంసిల నీటి నిల్వను కలిగి ఉంది. 24 వేల హెక్టార్ల ఆయకట్టు ఉంది. వెలిగల్లు ప్రాజెక్టు రాయచోటి పట్టణానికి తాగునీటి సమస్యను తీరుస్తోంది.

బుగ్గవంక ప్రాజెక్టు : 0.506 టిఎంసిల నిల్వ సామర్థ్యాన్ని కలిగి ఉంది. 0.049 టిఎంసిల నీటి నిల్వను కలిగి ఉంది. తాగునీటి అవసరాలకు మాత్రమే పరిమితమైనట్లు తెలుస్తోంది.

అన్నమయ్య ప్రాజెక్టు : 4 టిఎంసిల నీటి నిల్వ సామర్థ్యాన్ని కలిగి ఉంది. 2021 కురిసిన భారీ వర్షపాతానికి ఆనవాళ్లు లేకుండా తెగిపోయింది.

లోయర్ సగిలేరు : 0.170 టిఎంసిల నీటినిల్వ సామర్థ్యంతో నిర్మితమైంది. ప్రాజెక్టులో 0.030 టిఎంసిలను కలిగి ఉంది. 13 వేల ఎకరాల ఆయకట్టు సాగయ్యే అవకాశం ఉంది.

ఎగువ సగిలేరు ప్రాజెక్టు : పోరుమామిళ్ల చెరువు నీటి మళ్లింపునకు ఉద్దేశించి ఆనకట్టు తర హాలో నిర్మించారు.

తప్పుల తడకగా ఓటర్ల జాబితా

జాబితాలో మృతుల పేర్లు

డబుల్, బోగస్ ఓట్లపై చర్యలు శూన్యం


ఫలితమివ్వని ఇంటింటి సర్వే

ఎన్నికల సంఘం ఆదేశాలు బేఖాతర్

ప్రజాశక్తి- పోరుమామిళ్ల

ఇటీవల అధికారులు విడుదల చేసిన ఓటరు జాబితా తప్పుల తడాఖాగా మారింది. జాబితాలో మృతుల పేర్లు, డబుల్, బోగస్ ఓట్లు ఉన్నాయి. దీంతో ఓటర్లు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. అధికారులు నిర్వహించిన ఇంటింటికీ సర్వే కూడా తూతూ మంత్రంగా చేశారనే విమర్శలున్నాయి.

మరణించిన వారి పేర్లు ఓటర్ల జాబితాలో అలాగే ఉంది. ఇదంతా అధికారుల నిర్లక్ష్యమేనని ప్రజలు చర్చించుకుంటున్నారు. మరణించి ఏళ్లు గడుస్తున్నా ఓటర్ జాబితా నుంచి వారి పేర్లు అలాగే వస్తున్నాయి. ఓటర్ జాబితాలో ఎటువంటి తప్పులకు ఆస్కారం ఇవ్వద్దని ఎన్నికల సంఘం పదేపదే చెబుతున్నా అధికారులు ఏమాత్రం పట్టిం చుకోలేదని విమర్శలు వెలుగుతున్నాయి. ఎన్నికల సంఘం ఆదేశాలతో చేపట్టిన ఇంటింటి సర్వే ఏ మాత్రం ఫలితాన్ని ఇవ్వలేదని ముసాయిదా జాబితాను పరిశీలిస్తే అర్థమవుతుంది. ఈ ఏడాది జులై 21 నుంచి ఆగస్టు 21 వరకు ఓటర్ జాబితా సవరణకు బిఎల్ఒల ద్వారా ఇంటింటి సర్వే నిర్వహించారు. అందుకు బూత్ స్థాయి అధికారులకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమాన్ని ఇచ్చారు. జాబితాలో డబుల్ ఎంట్రీలు, నకిలీ, మృతుల ఓట్లను గుర్తించి తొలగించాలని ఎన్నికల సంఘం ఆదేశించింది. ఇంటింటి సర్వే పర్యవేక్షణకు గాను ప్రతి నియోజకవర్గానికి ప్రత్యేక అధికారులను నియమించారు. ఇంత చేసినా తప్పులు అలాగే ఉండిపోయాయి. ప్రత్యేకంగా నియమించిన అధికారుల పర్యవేక్షణ బిఎల్ఒల పనితీరుపై పూర్తిగా విఫలమైందని ప్రజలు చర్చించుకుంటున్నారు.


274 XLM2263283 పేరు : బాలకృష్ణ దాసరిపల్లి తండ్రి పేరు: సుందర్ రావు దాసరిపల్లి ఇంటి సంఖ్య : 147 వయస్సు : 20 లింగం : పురుషుడు	275 XLM22632 పేరు : బాలకృష్ణ దాసరిపల్లి తండ్రి పేరు: సుందర్ రావు దాసరిపల్లి ఇంటి సంఖ్య : 147 వయస్సు : 20 లింగం : పురుషుడు

ఒకే వ్యక్తికి పక్క పక్కనే డబుల్ ఎంట్రీ ఉన్న ఓట్లు

రెండు చోట్ల...

పోరుమామిళ్ల మండలం పరిధిలోని అక్కల రెడ్డిపల్లె పంచాయతీ పరిధిలో 41వ పోలింగ్ కేంద్రానికి సంబంధించిన ఓటురు జాబితాలో వరుస సంఖ్య 274లో దాసరిపల్లి బాలకృష్ణ పేరుతో రెండు ఓట్లు ఉన్నాయి. పక్క పక్కనే డబుల్ ఓటు ఉన్నా తొలగించలేదు. అదేవిధంగా 41పోలింగ్ కేంద్రానికి సంబంధించి 755 ఓట్లు ఉంటే, అందులో 219, 221, 223, 228, 233, 241, 260, 272, 273, 275, 291, 294, 301, 306, 314 ఇంకా దాదాపు పదుల సంఖ్యలో మృతుల పేర్లు జాబితాలో ఉన్నాయి. ఒక పోలింగ్ కేంద్రంలోనే దాదాపు 30 నుండి 50 వరకు మృతుల పేర్లు ఉన్నాయి. దీన్నిబట్టి చూస్తే ఇంటింటి సర్వే ఏ మాత్రం జరిగిందో ఇట్టే అర్థం చేసుకోవచ్చు.

వేల సంఖ్యలోనే..

ముసాయిదా జాబితాలో వేల సంఖ్యలో మృతుల ఓట్లు ఉన్నాయి. పోరుమామిళ్ల మండలం పరిధిలో అక్కల్‌రెడ్డి పల్లె గ్రామపంచాయతీలోని 41వ పోలింగ్ కేంద్రంలో 755 ఓట్లు ఉన్నాయి. 41వ పోలింగ్ కేంద్రంలోనే దాదాపు 30 నుండి 50 మృతుల ఓట్లు ఉన్నాయి. ఈ మృతుల్లో ఉన్నవారు గతించి ఏళ్లు గడుస్తున్న వారి పేర్లను జాబితాలో నుంచి తొలగించేందుకు అధికారులు ఎందుకు మీనమేషాలు లెక్కిస్తున్నారో.. అందుకు గల ఆంతర్యం ఏమిటో అని ప్రజలు చర్చించుకుంటున్నారు. వార్డులోని కొంత భాగంలో దాదాపు 50 వరకు మృతుల పేర్లు ఉంటే నియోజకవర్గ వ్యాప్తంగా ఆ సంఖ్య వేలల్లో ఉంటుందని ప్రతిపక్ష పార్టీ నాయకులు, ప్రజలు ఆరోపిస్తున్నారు.

నేటి నుంచి పెద్దదర్గా ఉరుసు మహోత్సవాలు

- 27న పాఠశాలలకు సెలవు

ప్రజాశక్తి - కడప అర్బన్

నగరంలోని పెద్ద దర్గా ఉరుసు మహోత్సవాలు ఈనెల 25 నుంచి డిసెంబర్ 1 వరకు నిర్వహించనున్నామని దర్గా కమిటీ సభ్యులు పేర్కొన్నారు. శుక్రవారం దర్గాలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడారు. శతాబ్దాల నాటి చరిత్ర కలిగిన ప్రఖ్యాత అమీన్ పీర్ దర్గా ఉత్సవాలను మత సామరస్యాన్ని ప్రతిబింబించేలా ఘనంగా నిర్వహించుకోవాలని కోరారు. ముందస్తు ప్రణాళికతో కలెక్టర్ ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు పేర్కొన్నారు. అందుకోసం అమీన్ పీర్ దర్గా (పెద్ద దర్గా) కమిటీ సభ్యులు, జిల్లా యంత్రాంగం అధికారులు, ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధుల సమన్వయంతో ఉత్సవాలను విజయవంతం చేయాలన్నారు. నగర పాలక సంస్థ వారి సహకారంతో పారిశుధ్య సిబ్బందిని ఏర్పాటు చేసి భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ప్రత్యేక శానిటేషన్ చేస్తున్నారని తెలిపారు. ఉరుసు ఉత్సవ ఏర్పాట్లను ఒక్కొశాఖ జిల్లా అధికారుల పర్యవేక్షణలో నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఉరుసు మహోత్సవాలలో భాగంగా కలెక్టర్ అధ్యక్షతన జరిగిన దర్గా కమిటీ సమావేశ తీర్మానం మేరకు ఈనెల 27న కడప నగరంలో పాఠశాలలకు స్థానిక సెలవుగా జిల్లా విద్యాశాఖ అధికారి ప్రకటించినట్లు కమిటీ సభ్యులు తెలిపారు. సమావేశంలో పెద్ద దర్గా కమిటీ సభ్యులు, నిర్వాహకులు,శిష్య కోటి బృందం పాల్గొన్నారు.



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న దర్గా కమిటీ సభ్యులు

మిల్లెట్ కేక్ తయారీపై శిక్షణ



కార్యక్రమంలో మాట్లాడుతున్న అసిస్టెంట్ ప్రొఫెసర్

ప్రజాశక్తి - చింతకొమ్మదిన్నె

ఏరువాక కేంద్రం ఊటుకూరు ఆత్మ, కడప వారి సహకారంతో చిరుధాన్యాల విలువ జోడింపు నైపుణ్య శిక్షణా కార్యక్రమంలో కృషి విజ్ఞాన కేంద్రంలో మూడవ రోజు శుక్రవారం మిల్లెట్ కేకు తయారు చేసే ప్రయోగాత్మక తరగతులు నిర్వహించారు. పులివెందులలోని ఫుడ్ సైన్స్ అండ్ టెక్నాలజీ కళాశాల నుంచి అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎస్. నజ్మా హఫీజా రిసోర్స్ పర్సన్లుగా విచ్చేసి శిక్షకుల సందేహాలను నివృత్తి చేశారు. అనంతరం వారు చిరుధాన్యాల ప్రాసెసింగ్ కోసం వివిధ స్టేజిల గురించి, చిరుధాన్యాల విలువ జోడింపునకు అవసరమయ్యే యంత్ర పరికరాలు, అవి లభ్యమయ్యే ప్రదేశాలు, వాటికయ్యే ఖర్చు వివరాల గురించి వివరించారు. కార్యక్రమంలో ఆత్మ డీపీడీ పి.పద్మలత, ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త ఎస్.రామలక్ష్మి దేవి,యువ రైతులు, మహిళా రైతులు, అభ్యుదయ రైతులు పాల్గొన్నారు.

కెవికెలో పుట్టగొడుగుల పెంపకంపై..

పుట్టగొడుగులు ఆరోగ్యానికి మంచి ఆహారమని ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త రామలక్ష్మిదేవి పేర్కొన్నారు, శుక్రవారం స్థానిక కృషి విజ్ఞాన కేంద్రం ఊటుకూరులో పుట్టగొడుగుల పెంపకంపై పాల పుట్టగొడుగులు, ముత్యపు చిప్ప పుట్టగొడుగుల పెంపకం పై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పుట్టగొడుగులు మంచి ఆహారమని భవిష్యత్తులో అందరూ పౌష్టికాహారంపై మొగ్గుతూపుతారని చెప్పారు. యువతీ యువకులు ఇలాంటి ఉపాధి కల్పించే కార్యక్రమంలో పాల్గొని, ఒక కుటీర పరిశ్రమ పెట్టి మంచి లాభాలు గడించాలని ఆ ఆకాంక్షించారు, కార్యక్రమంలో కెవికె సమన్వయకర్త డాక్టర్ వీరయ్య శాస్త్రవేత్తలు డాక్టర్ శిల్పకళ, సాయి మహేశ్వరి, మానస, స్వామి చైతన్య పాల్గొని ప్రసంగించారు.

విద్యార్థి మేలుకో.. భవిష్యత్ కాపాడుకో పోస్టర్ ఆవిష్కరణ

కడప అర్బన్ : టిడిపి పొలిట్ బ్యూరో సభ్యుడు ఆర్.శ్రీనివాస రెడ్డి ఆధ్వర్యంలో టిఎన్ఎస్ఎఫ్ కడప పార్లమెంట్ అధ్యక్షులు గొరిగెనూరు సుధీర్ రెడ్డి, టిఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర, పార్లమెంట్, నియోజకవర్గ, సభ్యులు 'విద్యార్థి మేలుకో భవిష్యత్ కాపాడుకో' అనే కార్యక్రమ పోస్టర్ శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆర్.శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ పార్లమెంట్ వ్యాప్తంగా అన్ని నియోజకవర్గలో నాటి ప్రతిపక్ష నాయకుడు నేటి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి జగన్ రెడ్డి విద్యార్థుల తల్లిదండ్రులకు, విద్యార్థులకు మేనమామనవుతానని చెప్పి కంసమామగా తయారయ్యారని తెలిపారు. గతంలో పీజీ చదివే విద్యార్థులకు పీజు రియంబెర్స్ మెంట్ ఇచ్చిందన్నారు. కార్యక్రమంలో టిఎన్ఎస్ఎఫ్ ప్రధాన కార్యదర్శి అబ్దుల్ హమీద్, పులివెందుల నియోజకవర్గం అధ్యక్షులు సాయి కృష్ణ రెడ్డి, పార్లమెంట్ ఉపాధ్యక్షులు భాను ప్రకాశ్, కడప సాంబ, సాయి, హర్ష సురేంద్ర పాల్గొన్నారు.

వైసిపి బస్సు యాత్ర తుస్సు : టిడిపి

కడప అర్బన్ : వైసిపి మంత్రులు, నాయకులు చేస్తున్న బస్సు యాత్ర కడపలో తుస్సుగా మారిందని టిడిపి సీనియర్ నాయకులు ఆలంఖాన్ పల్లె లక్ష్మిరెడ్డి, కడప నియోజకవర్గ మాజీ ఇన్‌ఛార్జి అమీర్ బాబు, సింగల్ విండో మాజీ ఛైర్మన్ మన్మోహన్ రెడ్డి అన్నారు. శుక్రవారం 8వ డివిజన్‌లో బాబు ష్యూరిటీ.. భవిష్యత్ గ్యారంటీ పేరుతో ఇంటింటికి కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చంద్రబాబు నాయకత్వంలో ముందుకు వెళ్లిన రాష్ట్రం, వైసిపి పాలనలో అధోగతి పాలయిందని విమర్శించారు. ఒక్క ఛాన్స్ పేరుతో జగన్ అధికారంలోకి వచ్చి తమను నిలువునా మోసం చేశారని ప్రజల ఆవేదన వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. వైసిపి నాయకులు దోచుకోవడం తప్ప ప్రజలకు చేసింది ఏమీ లేదని విమర్శించారు. నాగ మల్లేష్ వారి మిత్రబృందం టిడిపిలో చేరడం హర్షనీయమని పేర్కొన్నారు. కార్యక్రమంలో నగర ఉపాధ్యక్షులు, ప్రముఖ న్యాయవాది లింగాల శివ శంకర్ రెడ్డి, మాజీ వార్డు సభ్యులు జయరాం రెడ్డి, కడప తెలుగు యువత నగర అధ్యక్షులు మేకల వెంకటేష్ యాదవ్, రామరాజు పల్లె మాజీ సర్పంచ్ వెంకటేష్, నగర మాజీ అధ్యక్షురాలు చిప్పగిరి మీనాక్షి, బీదోళ్ళ స్వర్ణలత, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

వైభవంగా బ్రహ్మంగారి 415 జయంతి ఉత్సవాలు

బ్రహ్మంగారిమఠం : బ్రహ్మంగారి 415వ జయంతి మహోత్సవాలు శుక్రవారం వైభవంగా నిర్వహించారు. పిట్ పర్సన్ శంకర్ బాలాజీ, మఠం మేనేజర్ ఈశ్వరయ్యాచారి పూర్వపు మఠాధిపతులు కుమారుల ఆధ్వర్యంలో కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. శుక్రవారం కార్తిక శుద్ధ ద్వాదశి స్వామి వారు అవతరించిన రోజు కావడంతో ఉదయం 10 గంటలకు ఉద్యానవనం వరకు ఊరేగింపు నిర్వహించి అక్కడ ప్రతిష్ఠించిన శ్రీ స్వామివారి శిలా మూర్తికి అభిషేకాలు చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాత్రి 7 గంటలకు శ్రీ గోవింద మామ సమేత శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వాముల వారి కల్యాణ మహోత్సవం ఏర్పాటు చేశారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు హాజరయ్యారు.

టిడ్కో లబ్ధిదారులకు న్యాయం చేయాలి

కడప అర్బన్ : తల దాచుకునేందుకు అప్పుసొప్పు చేసి డబ్బు చెల్లించినా ఇంతవరకు ఇళ్లు ఇవ్వలేదని, అసలు టిడ్కో లబ్ధిదారులు చేసిన పాపమేంటో చెప్పాలని తెలుగుదేశం, జనసేన నాయకులు ప్రశ్నించారు. శుక్రవారం కడప జ్యోతికెమికల్స్ సమీపంలోని టిడ్కో ఇళ్లను తెలుగుదేశం పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యుడు శ్రీనివాసరెడ్డి, కడప ఇన్‌ఛార్జి మాధవి, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శులు హరిప్రసాద్, గోవర్ధన్ నెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి వికాస్ హరి, జనసేన జిల్లా బాధ్యులు శ్రీనివాస్ పరిశీలించారు. పలువురు లబ్ధిదారులతో మాట్లాడారు. అక్కడున్న స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. కంపచెట్ల మధ్య ఉన్న ఇళ్లను పరిశీలించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ దున్నపోతుమీద వాన కురిసినట్లు చంద్రబాబు చేపట్టిన కార్యక్రమాలను సిఎం జగన్ ఎక్కడికక్కడే ఆపేశారన్నారు. కడప నగరంలోని గత ప్రభుత్వంలో 2400 ఇళ్లు మొదలు పెట్టి సుమారు 90 శాతం పూర్తి చేశారని లబ్ధిదారుల ఎంపిక కూడా పూర్తి చేశామన్నారు. వైసిపి రంగులు కొట్టుకున్నా పేదలకు ఇళ్లు ఇవ్వడంలో నాలుగేళ్లుగా నిరుపయోగంగా ఉంచారు. ప్రభుత్వానికి బాధ్యత లేదని కేవలం అవినీతి, అక్రమ సంపాదన తప్పమరొకటిలేదన్నారు. ఇప్పటికైనా జిల్లా యంత్రాంగం కళ్లు తెరచి ఇళ్లను కేటాయించాలని డిమాండ్ చేశారు. కూడళ్ల సుందరీకరణ పేరుతో ప్రజలను ఇబ్బందులు పెడుతున్నారన్నారు. జిల్లా యంత్రాంగం స్పందించి లబ్ధిదారులకు ఇళ్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు జిలానీబాషా, పీరయ్య పాల్గొన్నారు.

మహాధర్నాను జయప్రదం చేయాలి

పోరుమామిళ్ల : మోడీ ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా చేపట్టే మహాధర్నాను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు బైరవ ప్రసాద్ పేర్కొన్నారు. శుక్రవారం సాయంత్రం సిఐటియు కార్యాలయంలో ఎపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్, ఎపి ఆటో డ్రైవర్ల యూనియన్, ఎపి భవన నిర్మాణ యూనియన్ ఆధ్వర్యంలో కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మోడీ ప్రభుత్వం బ్యాంకులలోని లక్షల కోట్ల రూపాయలను కార్పొరేట్లకు ఉదారంగా అందజేస్తూ, ఈ 9 సంవత్సరాల కాలంలో దాదాపు రూ.12 లక్షల కోట్ల రుణాలను రైటాఫ్ పేరుతో రుణమాఫీ చేసిందన్నారు. వ్యవసాయ సంక్షోభం ఫలితంగా అప్పుల ఊబిలో కూరుకు పోయి ఆత్మహత్యలు చేసుకుంటున్న రైతుల రుణాలు మాఫీ చేయడానికి మోడీ ప్రభుత్వానికి చేతులు రావడం లేదన్నారు. రాజ్యాంగ నిబంధనలను ఉల్లంఘిస్తూ ఓడరేవులు, ఎయిర్ పోర్టులు, విద్యుత్ సంస్థలు, రైల్వే, బొగ్గు గనులు, చివరకు ఆదివాసి, గిరిజనుల అటవీ భూములపై హక్కులను హరిస్తూ తాజాగా అటవీ చట్టానికి సవరణ పాస్ చేసిందని విమర్శించారు. ఈనెల 27, 28 తేదీల్లో విజయవాడలో జరిగే రాష్ట్ర స్థాయి మహాధర్నాను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా కమిటీ సభ్యురాలు ఓబులాపురం విజయమ్మ, అంగన్వాడీ యూనియన్ టేకూరుపేట సెక్టార్ లీడర్ దస్తగిరమ్మ, పోరుమామిళ్ల సెక్టార్ లీడర్ జ్యోతిమ్మ వాణి, రవణమ్మ అంగన్వాడీ టీచర్లు ఆటో యూనియన్ అధ్యక్షులు బొజ్జ చిన్నయ్య, గురయ్య భవన నిర్మాణం మండల నాయకులు నజీరు, హరిబాబు ఆటో డ్రైవర్లు భవన నిర్మాణం, సిఐటియు నాయకులు పాల్గొన్నారు.

ఆలయానికి ఎసి వితరణ

కడప : నగరంలోని మోచంపేటలో ఉన్న శ్రీ ప్రసన్న విశ్వేశ్వర స్వామి ఆలయానికి ఎయిర్ కండిషనర్‌ను కెనరా బ్యాంకు రీజినల్ మేనేజర్ కె. మురళీమోహన్ అందజేశారు. కెనరా బ్యాంకు 118 వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా శుక్రవారం కార్పొరేట్ సామాజిక బాధ్యత కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా ఆలయానికి ఎయిర్ కండిషనర్‌ను బహుకరించారు. కార్యక్రమంలో డివిజనల్ మేనేజర్ ఏ.వి.రాజశేఖర్, మోసంపేట కెనరా బ్యాంకు మేనేజర్ నవీన్ కుమార్, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

కుల గణనకు సిద్ధం కావాలి

పోరుమామిళ్ల : కుల గణనకు సిద్ధం కావాలని రాష్ట్ర కాపు కార్పొరేషన్ చైర్మన్ అడప శేషు, ఆప్కాస్ స్టేట్ డైరెక్టర్ డాక్టర్ కళ్యాణ్ చక్రవర్తి పేర్కొన్నారు. శుక్రవారం పట్టణంలోని డాక్టర్ కళ్యాణ చక్రవర్తి స్వగృహంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతదేశ జనాభాలో సింహభాగం ఉన్న వెనుకబడిన తరగతులు(బిసి) కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలతో ఇంకా వెనుకబాటుతనానికి గురవుతున్నాయని, ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి కుల గణనకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందని తెలిపారు. గతంలో ఎన్ని ప్రభుత్వాలు మారినా బిసిలకు ఇవ్వాల్సినంత శాతం రిజర్వేషన్ ఇవ్వలేదన్నారు. రిజర్వేషన్ సాధన కోసం అనేక సంఘాలు ఉద్యమిస్తున్నాయన్నారు. బిసిలు రాజ్యాధికారమే లక్ష్యంగా ముందుకు అందరం సాగలన్నారు. చాలామంది ఆర్థికంగా ఇంకా వెనుకబడే ఉన్నారు. బిసి అభివృద్ధికి తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ లాంటి రాష్ట్రాలు ముందుకు వచ్చాయన్నారు. గతరాజకీయ పార్టీలు బిసిలను కేవలం ఓటు బ్యాంక్‌గానే చూశాయని, తమ హక్కుల సాధన, రాజ్యాధికారం కోసం అనేక ఏళ్లుగా ఉద్యమిస్తున్నా ఐక్యత లేకపోవడం వల్ల హక్కుల సాధనలో వెనుకబడుతున్నారని తెలిపారు. మన అభివృద్ధి కోరే వ్యక్తికి మనం వెన్నుదండుగా నిలవాలని పిలుపునిచ్చారు.

సూపరింటెండెంట్లకు సన్మానం

ప్రజాశక్తి - కడప అర్బన్

రిమ్స్ ఆవరణలో ఏర్పాటు చేసిన సూపర్‌స్పెషాల్టీ, కేన్సర్, సైకియార్టీ విభాగాలకు సూపరింటెండెంట్లుగా డాక్టర్ సర్వేశ్వర్‌రెడ్డి, డాక్టర్ వాణిని, డాక్టర్ వెంకటరాముడిని నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈనేపథ్యంలో శుక్రవారం రిమ్స్ ఎపి మెడికల్ అండ్ హెల్త్ కాంట్రాక్ట్ ఎంప్లాయీస్ అండ్ అవుట్ సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో వారిని కలిసి అభినందనలు తెలియజేస్తూ సన్మానించారు. కార్యక్రమంలో కమిటీ అధ్యక్షులు పి. వెంకటసుబ్బయ్య, ప్రధాన కార్యదర్శి పి.వి. సుదర్శన్, కోశాధికారి ఎల్.వి. రమణారెడ్డి, ఉపాధ్యక్షులు ఎల్. భాస్కర్, బి.బాలాజీ రావు, కె.ఏసన్న, కార్యదర్శులు కొండయ్య, చెన్నయ్య, సురేష్, కమిటీ సభ్యులు జయరాం, కన్నయ్యా, సుబ్బారావు, పవన్, జయసుధ, కార్మికులు సతీష్, దస్తగిరి, లక్ష్మీప్రసాద్, జయ కాంత్, నాగేంద్ర పాల్గొన్నారు.

ప్రతి పౌరుడికీ ఓటు హక్కు అవసరం

ప్రజాశక్తి - కడప

దేశంలోని అర్హుడైన ప్రతి పౌరుడు ఓటరుగా నమోదు చేసుకోవాలని ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ మైనార్టీ విభాగపు ఉపాధ్యక్షులు పటాన్ మహమ్మద్ అలీ ఖాన్ పేర్కొన్నారు. కడప నగరంలోని రవీంద్ర నగర్‌లో గుల్కన్ మసీదు కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం ఓటరు అవగాహన నమోదు పరిశీలన కేంద్రాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కమిటీ వారు ఉచితంగా కార్యక్రమాన్ని నిర్వహించడం సంతోషదాయకం అన్నారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి పౌరుడూ కొత్తగా ఓటరుగా నమోదు చేసుకోవాలని కోరారు. ఓటు హక్కు ఉన్నవారు కూడా తమ ఓటుకు సంబంధించిన పూర్వపరాలు పరిశీలించి అవసరమైన వారు తగు మార్పులు, చేర్పులు చేసుకోవచ్చున్నారు. స్థానికులేగాక దూరప్రాంతాల నుంచి కూడా ఉచిత ఓటరు అవగాహన శిబిరానికి రావడం శుభ పరిణామం అన్నారు. ప్రభుత్వాలను ప్రజలు ఎన్నుకునే ఆయుధంగా ఓటు ఉపయోగపడుతుందని వివరించారు. శిబిరంలో తమ ఓటు వివరాలు తగు మార్పులు, చేర్పులను చేసుకోవచ్చున్నారు. ప్రభుత్వాలను ఎన్నుకునే వజ్రా యుధంగా ఓటును పరిగణించాలన్నారు. కార్యక్రమంలో గుల్కన్ మసీదు కమిటీ అధ్యక్షుడు చాంద్‌బాషా, న్యాయవాది హలీం, స్వచ్ఛంద కార్యకర్తలు అహ్మద్ పాల్గొన్నారు.


ఓటర్ల నమోదును పరిశీలిస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఏకాగ్రత తప్పనిసరి

ప్రజాశక్తి - కడప


ఫైరింగ్‌లో శిక్షణ ఇస్తున్న అధికారులు

లక్ష్యాన్ని ఛేదించడంలో ఆయుధంపై పట్టు, ఆత్మవిశ్వాసం, ఏకాగ్రత తప్పనిసరిగా ఉండాలని ఎన్‌సిసి 30 ఆంధ్ర బెటాలియన్ కమాండింగ్ అధికారి లెఫ్టినెంట్ కల్నల్ రాజ్‌కుమార్ తాప అన్నారు. కడప నగరంలోని తెలుగు గంగ కాలనీలో శుక్రవారం ఎన్‌సిసి కేడెట్లకు శిక్షణ శిబిరం నిర్వహించారు. క్యాంపు డిప్యూటీ కమాండెంట్ లెఫ్టినెంట్ డాక్టర్ నీలయ్య మాట్లాడుతూ ఎన్‌సిసి కేడెట్లకు ఫైరింగ్‌లో మెలకువలు నేర్పించడంతోపాటు ప్రత్యేక శిక్షణ ఇచ్చామని చెప్పారు. కార్యక్రమంలో ఎన్‌సిసి అధికారులు లెఫ్టినెంట్ మహేష్, పొన్నతోట రాజు పరేడ్ శిక్షకులు సుబేదార్ అశోక్, బిస్నోయ్, సి.ఎల్.రెడ్డి, జగదీష్, కొండా రెడ్డి ఆఫీసు సిబ్బంది సూపరింటెండెంట్ సరస్వతి, డేవిడ్, ఉమ, ప్రియ, రాజగోపాల్ రెడ్డి, శివ ప్రసాద్ పాల్గొన్నారు.

ప్రతి ఇంట్లో ఒక రక్తదాత ఉండాలి

కడప : రక్తదానం ప్రాణదానంతో సమానమని, ఆపద సమయంలో ఉన్నవారికి రక్తదానం చేసేందుకు ప్రతి ఇంట్లో ఒక రక్తదాత ఉండాలని రైల్వే శాఖ అధికారి చౌహన్ అన్నారు. శుక్రవారం రాయల్ కరిముల్లా ముద్రించిన రక్తదాన కరపత్రాలను చౌహాన్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రక్తదాన ప్రచారం ఎంతో అవసరం. కడప నగరంలో దాదాపు 3 సంవత్సరాల నుంచి రక్తదాన ప్రచారం చేస్తున్న అబ్దుల్ రాయల్ కరీముల్లా సేవల అభినందనీయమని అన్నారు. రాబోవు రోజులలో కూడా రక్తదాన ప్రచారం చేపట్టాలని ఆయన కోరారు. కార్యక్రమంలో స్టేషన్ మాస్టర్, అసిస్టెంట్ స్టేషన్ మాస్టర్ అతావుల్లా, శేఖర్ కుమార్ పాల్గొన్నారు.

ప్రతిభా పురస్కారం అభినందనీయం

ప్రజాశక్తి- కడప అర్బన్

కళా మిత్ర మండలి ఒంగోలు వారు ఈనెల 26న లెక్చరర్‌గా కవయిత్రి గా సామాజిక కార్య కర్త గా నిరంతరం కృషి చేస్తున్న డాక్టర్ పెద్దిరెడ్డి నీలవేణి కి రాష్ట్ర స్థాయి పురస్కారం అందజేయడం అభినందనీయమని వైఎస్ఆర్ జిల్లా రచయితల సంఘం అధ్యక్షులు ఆచార్య మూల మల్లికార్జున రెడ్డి తెలిపారు. తమ రచయితల సంఘంలో కార్యవర్గ సభ్యురాలుగా ఉన్న నీలవేణి పురస్కారం అందుకోవడం ఆమె కృషికి నిదర్శనమన్నారు. గతంలోనూ ఆమె ఎన్టీ రామారావు, శంకర్ దయాళ్ శర్మ చేతుల మీదుగా ప్రతిభా పురస్కారాలు అందుకున్నా రని చెప్పారు.

అన్ని వర్గాలకు ప్రభుత్వం అండ
-వైసిపి నాయకులు ప్రవీణ్ కుమార్

ప్రజాశక్తి - ముద్దనూరు



ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రతి గడపకు ప్రభుత్వ ఫలాలను అందిస్తూ అన్ని వర్గాల ప్రజలకు అండగా నిలుస్తున్నారని కొలవలి గ్రామం వైసిపి నాయకులు నల్లబల్లె ప్రవీణ్ కుమార్ అన్నారు. ప్రజాశక్తితో ఆయన మాట్లాడుతూ ప్రజా సంక్షేమే లక్ష్యంగా ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. పార్టీలకు, కుల మతాలకు అతీతంగా ప్రతి గడపకు సంక్షేమ ఫలాలు అందిస్తూ చేయూత నిస్తున్నట్లు చెప్పారు. ప్రభుత్వం అన్ని వర్గాలకు అండగా నిలుస్తుందన్నారు. రాష్ట్ర ప్రజల అభివృద్ధికి జగన్ అహర్నిశలు కృషి చేస్తున్నారన్నారు. వినూత్న పథకాలతో రాష్ట్రాన్ని దేశానికి ఆదర్శంగా నిలబెట్టారన్నారు. సిఎం, ఎంపీ అవినాష్ రెడ్డి సహకారంతో ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి నియోజకవర్గ అభివృద్ధికి ప్రజల సమస్యలకు పాటు పడుతున్నారన్నారు. పార్టీ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానన్నారు. ప్రభుత్వ పథకాలను ప్రజలకు మరింత చేరువ చేసేందుకు నిరంతరం కృషి చేస్తానన్నారు. గ్రామాభివృద్ధికి తన వంతు కృషి చేస్తానన్నారు. ప్రభుత్వ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని ప్రవీణ్ కుమార్ కోరారు.

అంగన్వాడీ పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానం

ప్రజాశక్తి- జమ్మలమడుగు

జమ్మలమడుగు ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలోని జమ్మలమడుగు, పెద్దముడియం, మైలవరం మండలాలకు సంబంధించిన అంగన్వాడీ కార్యకర్త, ఆయా పోస్టులకు అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని జమ్మలమడుగు ఐసిడిఎస్ ప్రాజెక్ట్ అధికారి రాజేశ్వరీదేవి తెలిపారు. ఈ నెల 30న సాయంత్రం 5 గంటల లోపు దరఖాస్తులు జమ్మలమడుగు పట్టణంలోని ఐసిడిఎస్ కార్యాలయంలో స్వీకరిస్తామని ఆమె పేర్కొన్నారు. అంగన్వాడీ కార్యకర్తకు సంబంధించి మైలవరం మండలంలోని దొమ్మర నంద్యాల ఎస్సి, మినీ అంగన్వాడీ కార్యకర్త బిసి(ఏ) కు కేటాయించారు. అంగన్వాడీ సహాయకురాలు సంబంధించి జమ్మలమడుగు పలగాడి వీధి ఇడబ్ల్యుఎస్, పెద్దముడియం మండలంలో నెమ్మలదిన్నె- బిసి (సి), పెద్ద పశువుల-4 - బిసి (ఇ) మైలవరం మండలంలోని దొమ్మర నంద్యాల -2 ఎసిటి, ఎం. కంబాలదిన్నె - ఇడబ్ల్యుఎస్‌లకు కేటాయించారు. **బద్వేలు :** స్థానిక ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలోని గోపవరం, బద్వేలు, అట్లూరు మండలాలలో ఖాళీగా ఉన్న అంగన్వాడీ ఆయా పోస్టుల భర్తీ కోసం ఆసక్తి కలిగిన వారు ఈనెల 30న సాయంత్రం 5 గంటలలోపు ఐసిడిఎస్ ప్రాజెక్ట్ బద్వేల్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని బద్వేల్ ఐసిడిఎస్ అధికారి శ్రీదేవి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బద్వేల్ మండలం పుట్టాయపల్లె బిసి కాలనీ రోస్టర్ పాయింట్ బిసి-ఎ, గోపవరం మండలంలో లక్కిరెడ్డిపల్లె ఒసి, ఎస్.రామాపురం ఎస్సి, అట్లూరు మండలం అట్లూరు 1 బిసి -బి పోస్టులు ఖాళీలున్నాయని దరఖాస్తుదారులు దరఖాస్తుతో పాటు గెజిటెడ్ అధికారిచే ధృవీకరించబడిన విద్యార్హత, కుల, ఆధార్, స్థానిక సర్టిఫికెట్లను జతపరిచి ఐసిడిఎస్ ప్రాజెక్ట్ బద్వేల్ కార్యాలయంలో అందజేయాలన్నారు. ఇంటర్వ్యూలు డిసెంబర్ 8న ఉంటాయన్నారు.



మాట్లాడుతున్న ఎంపిపి లక్ష్మీ సురేష్ యాదవ్

మళ్లీ జగనే సిఎం కావాలి : ఎంపిపి

ప్రజాశక్తి - చెన్నూరు

ముఖ్యమంత్రిగా మళ్లీ వైఎస్ జగన్మోహన్ రెడ్డి రావాలని ప్రజలు కోరుకుంటున్నారని ఎంపిపి చీర్ల సురేష్‌యాదవ్ అన్నారు. శుక్రవారం ఒకటవ సచివాలయంలో జగనన్న నువ్వే మా నమ్మకం కార్యక్రమం నిర్వహించారు. ముందుకు వైఎస్ఆర్ పార్టీ జెండాను కన్వీనర్ భాస్కర్ రెడ్డితో కలిసి ఆవిష్కరించారు. అనంతరం ఒకటవ సచివాలయం ఆవరణంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎంపిపి మాట్లాడుతూ అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి ప్రజలు చెరగని ముద్ర వేసుకున్నారని ఆయన అన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ వెంకటసుబ్బయ్య, కొండపేట సర్పంచ్ తుంగ చంద్ర యాదవ్, మండల సర్పంచ్ సంఘం అధ్యక్షుడు ఎస్ వి నారాయణరెడ్డి, పార్టీ నాయకులు, ఇఓపిఆర్డి సురేష్ బాబు, ఎఎంసి చైర్మన్, పంచాయతీ సెక్రటరీ రామ సుబ్బారెడ్డి, రమణ, శ్రీనివాస్ రెడ్డి అన్వర్‌బాష, మహమ్మద్ రఫీ, శివాల పల్లె సర్పంచ్ సుదర్శన్ రెడ్డి మునీర్, మహిళలు పాల్గొన్నారు. **చాపాడు :** అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాల ద్వారా ప్రభుత్వం నుంచి లబ్ది చేకూరిందని ఎంపిపి బి లక్ష్మయ్య పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ జగన్ ఎందుకు కావాలంటే కార్యక్రమాన్ని శుక్రవారం సచివాలయాల్లో నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ఎంపిపితోపాటు మండల కన్వీనర్ రాజశేఖర్ రెడ్డి హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో ఇఓపిఆర్డి రాధాకృష్ణ వేణి, సర్పంచ్ మహబూబ్‌బీ, వెంకటేశ్వర్ రెడ్డి, ఉప సర్పంచ్ విజయ కుమార్ రెడ్డి, జుబేర్, కోగటం మాబు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, సచివాలయ కన్వీనర్లు, కార్యకర్తలు, వాలంటీర్లు పాల్గొన్నారు. **వేంపల్లె:** రాష్ట్ర ప్రజలకు జగనన్న ప్రభుత్వం మెరుగైన పాలన అందిస్తున్నట్లు వైసిపి మండల కన్వీనర్ చంద్రఓబుల్ రెడ్డి, జెసిఎస్ కన్వీనర్ ఆర్.శ్రీనివాసులు, ఎంపిపి లక్ష్మీగాయత్రి పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని ముతుకూరులో ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. ముందుగా నవరత్నాల పథకాలు చెందిన లబ్దిదారుల వివరాలను సంబంధించిన బోర్డును ఆవిష్కరించారు. ప్రతి గడపకు వెళ్లి ప్రస్తుత ప్రభుత్వ పాలన, గత ప్రభుత్వ పాలన పట్ల ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అగ్రికల్చర్ అధికారి సోమశేఖర్ రెడ్డి, ఏపీ హెచ్ కమిటీ డైరెక్టర్ మునీర్, సర్పంచ్ గంగాదేవి, ఎంపిటిసి చంద్రఓబుల్ రెడ్డి, సచివాలయ కన్వీనర్లు గోపాల్ రెడ్డి చంద్రశేఖర్ రెడ్డి గంగులయ్య, వైసిపి నాయకులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

రోడ్డు ప్రమాదంలో ఇరువురికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి - వేంపల్లె

కడప - పులివెందుల బైపాస్ రోడ్డులో చోటు చేసుకున్న రోడ్డు ప్రమాదంలో ఇరువురు వ్యక్తులకు తీవ్ర గాయాలు అయ్యాయి. వేంపల్లెలోని బిద్దాల మిట్ట ప్రాంతానికి చెందిన ఇమాంఖాన్, ఆబు హరీన్ అనే ఇరువురు వ్యక్తులు శుక్రవారం పాములూరు గ్రామానికి బేల్దారు పనులకు వెళ్లారు. మధ్యాహ్నం వరకు పనులు చేసి భోజనం చేసేందుకు పాములూరు నుంచి మోటర్ బైక్‌లో వేంపల్లెలోని రాజీవ్ నగర్ సమీపంలో ఉన్న హోటల్‌కు వెళ్లి భోజనం చేశారు. తర్వాత ఇరువురు తిరిగి పనికి మోటార్ బైక్‌లో వెళుతుండగా పులివెందుల - కడప బైపాస్ రోడ్డులో ఉన్న పెట్రోలు బంకు వద్దకు రాగానే మోటర్ బైక్ అదుపు తప్పి కంప చెట్లలోకి వెళ్లింది. దీంతో ఇమాంఖాన్‌కు తీవ్ర గాయాలు కాగా ఆబు హరీన్‌కు స్వల్ప గాయాలయ్యాయి. సంఘటన చూసిన స్థానికులు 108 ద్వారా వేంపల్లె ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి ప్రథమ చికిత్సలు చేయించారు. ఇమాంఖాన్‌కు తీవ్రంగా గాయాలు కావడంతో మెరుగైన వైద్యం కోసం కడప రిమ్స్ కు తరలించారు. గాయపడిన వారి బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తిరుపాల్ నాయక్ తెలిపారు.

విద్యుదాఘాతంతో జూనియర్ లైన్‌మెన్ మృతి

చక్రాయపేట : స్థానిక సబ్ స్టేషన్‌లో జూనియర్ లైన్‌మెన్‌గా పనిచేస్తున్న చాపాటి శ్రీరామచంద్రారెడ్డి (26) విద్యుదాఘాతానికి గురై మృతిచెందాడు. వివరాలు.. వేంపల్లి మండలం ఉప్పాల పల్లె గ్రామానికి చెందిన శ్రీరామ చంద్రారెడ్డి నాలుగు సంవత్సరాలుగా చక్రాయపేట సబ్ స్టేషన్‌లో జూనియర్ లైన్‌మెన్‌గా పనిచేస్తున్నాడు. దినచర్యలో భాగంగా శుక్రవారం ఉదయం 8. 30 గంటలకు సురభి లైన్ ఎల్‌సి తీసుకుని కుమ్మర పీటలోల ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ ఫీజు వేస్తుండగా విద్యుత్‌షాక్ గురై అక్కడికక్కడే మృతి చెందాడు. 11 గంటలు అవుతున్నా రామచంద్రారెడ్డి నుంచి సమాచారం రాకపోవడంతో సబ్‌స్టేషన్‌లో పనిచేస్తున్న సిబ్బంది, ఎఇ అతని కోసం వెతికారు. చివరికి కుమ్మర పీటలోల ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ వద్ద మృతి చెంది ఉన్నాడు. పోస్టు మార్టం నిమిత్తం మృతదేహాన్ని వేంపల్లె ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనంతరం మృతుడి కుటుంబ సభ్యులకు అప్పగించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వినోద్ కుమార్ తెలిపారు.

వర్షానికి తడిసిన ధాన్యం
ఆందోళనలో రైతన్నలు



వేంపల్లె : తడిసిన ధాన్యాన్ని ఆరబెడుతున్న రైతులు

ప్రజాశక్తి - వేంపల్లె

జోరు వానతో రోడ్డుపై ఆరబెట్టిన ధాన్యం తడిసి ముద్దయింది. దీంతో రైతులు తడిసిన ధాన్యాన్ని చూసి కన్నీరుమున్నీరవుతున్నారు. మండలంలోని , వీరన్నగట్టుపల్లె, కుమ్మరాంపల్లె, ఇడుపులపాయ గ్రామాలకు చెందిన రైతులు సాగు చేసిన వరి పంటను కోసి ధాన్యాన్ని రోడ్డుపై ఆరా బెట్టారు. శుక్రవారం మధ్యాహ్నం ఒక్కసారిగా జోరుగా వర్షం కురవడంతో కుమ్మరాంపల్లె, వీరన్నగట్టుపల్లె గ్రామాల పరిధిలో రోడ్డుపై ఆరబెట్టిన ధాన్యం తడిసి పోయింది. వర్షపు నీటిలో కొంత ధాన్యం కొట్టుకొని పోయినట్లు రైతులు వాపోతున్నారు. చేతికి వచ్చిన ధాన్యం తడిసి పోవడంతో నష్టం వాటిల్లిందని ఆవేదన వ్యక్తం చేశారు. తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు ఎవరూ ముందుకు రారని వాపోతున్నారు. ధాన్యం చుట్టూ నీరు నిల్వ ఉండడంతో తొలగించేందుకు రైతులు అవస్థలు పడ్డారు. దిగుబడి బాగా వచ్చినప్పటికీ ఆర బెట్టిన ధాన్యం తడిసి పోవడంతో నష్టం కలిగిందని పేర్కొన్నారు. ప్రభుత్వమే తమను ఆదుకోవాలని వేడుకుంటున్నారు. **చాపాడు :** వారం రోజులుగా మబ్బులు కమ్ముకొని దోబూచులాట ఆడుతున్న మేఘాలు శుక్రవారం ఎట్టకేలకు కరుణించాయి . వర్షానికి మండల వ్యాప్తంగా వివిధ రకాల పంటలు నూర్పిడి చేసే రైతులు ఇబ్బందులు పడ్డారు. వాత వరణంలో మార్పుల కారణంగా మండల పరిధిలో వర్షం కురిసింది. ఖరీఫ్ సీజ న్‌లో సాగైన వరి పంట ప్రస్తుతం నూర్పిడి దశలో ఉంది. రైతులు వరి పంట నూర్పిడి చేసి వరి ధాన్యాన్ని ఆరబెడుతున్నారు. వర్షం ఒక్కసారిగా పడ టంతో ధాన్యాన్ని కాపాడుకునేందుకు నానా అవస్థలు పడాల్సి వచ్చింది. వరి ధాన్యాన్ని రోడ్లు, ఖాళీ ప్రదేశాలలో ఆరబోతకు ఉంచారు. వర్షం పడగానే ప్లాస్టిక్ పట్టాలను వేసి వరి ధాన్యాన్ని కప్పి కాపాడుకునే ప్రయత్నం చేశారు. మండల పరిధిలోని చాపాడు, పల్లవోలు, అయ్యవారిపల్లె, తిమ్మాయపల్లె, సీతా రామపురం గ్రామాల పరిధిలో వరి పంట పంటను కాపాడుకునే ప్రయత్నం చేశారు.

ఎన్నికలు పటిష్టంగా నిర్వహించాలి : ఆర్‌డిఒ

ప్రజాశక్తి -జమ్మలమడుగు రూరల్

రాబోయే ఎన్నికలను నియోజకవర్గంలో పటిష్టంగా నిర్వహించాలని జమ్మలమడుగు రెవెన్యూ డివిజనల్ అధికారి జి. శ్రీనివాసులు తెలిపారు. శుక్రవారం స్థానిక ఆర్‌డిఒ కార్యాలయంలోని సభా భవనంలో సెక్టార్ ఆఫీసర్ ఎఇఆర్‌ఒలతో సమావేశం నిర్వ హించారు. ఈ సందర్భంగా ఆర్‌డిఒ మాట్లాడుతూ కలెక్టర్ ఎన్నికలను సజావుగా నిర్వహించేందుకు చర్యలు తీసుకుం టున్నా రన్నారు. జిల్లాలో మొత్తం ఏడు అసెంబ్లీ నియోజక వర్గాలున్నాయని వాటికి నేటి నుంచే విధివిధానాలను రూపొందించి సమావేశాలు నిర్వహించేందుకు ఆదేశించారన్నారు. ఆమేరకు జమ్మలమడుగు నియోజకవర్గాన్ని 32 జోన్లుగా (రూట్స్) విభజించారని 32 జోన్లలో 315 పోలింగ్ స్టేషన్‌లు ఉన్నాయని వివరించారు. ఇచ్చిన ప్రొఫార్మలో ఏవైనా లోపాలు ఉంటే గుర్తించి తమ దృష్టికి తీసుకురావాలన్నారు. పోలింగ్ స్టేషన్ పరిధిలో ఓటు వేయడానికి రాకుండా ఉన్నవారిని, అడ్డుకునే వారిని గుర్తిం



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్‌డిఒ శ్రీనివాసులు

చాలన్నారు. వారికి కౌన్సెలింగ్ ఇవ్వాలి అన్నారు. ప్రతి ఒక్కరూ స్వేచ్ఛగా ఓటు వేసేలా చూడాలని, దొంగ ఓట్లు వేయడానికి వచ్చే వ్యక్తుల పట్ల కఠి నంగా వ్యవహరించాలని సూచించారు. పోలింగ్ స్టేషన్‌లో అన్ని రకాల సౌకర్యాలు ఉన్నాయా లేవా అనేది పోలింగ్ ఆఫీసర్ తెలుసు కోవాల న్నారు. లేకపోతే వాటిని ఏర్పాటు చేసుకో వాలని సూచించారు. ఎన్నికల రోజు అజాగ్రత్తగా వ్యవహరించరాదని తెలిపారు. బాధ్యతతో పని చేయని వ్యక్తులను లేదా అధికారులను కలెక్టర్ ఇంటికి పంపించేందుకు చర్యలు తీసుకోమని తెలి పారన్నారు. ఆర్‌డిఒనే ఎన్నికల రిటర్నింగ్ అధి కారిగా నియోజకవర్గంలో వ్యవహ రిస్తారన్నారు. ఆరుగురు అసిస్టెంట్ ఎలక్షన్ రిటర్నింగ్ ఆఫీసర్స్ ఉంటారన్నారు. కార్యక్ర మంలో ఆరు మండలాల సెక్టార్ ఆఫీసర్లు, ఎఇఆర్‌ఒలు, ఎలక్షన్ డిప్యూటీ తహశీల్దార్ రఫీ, సీనియర్ ఎలక్షన్ అధికారులు మస్తాన్ వలి పాల్గొన్నారు.

స్వాతంత్ర్య సమరయోధుడు 'ఉయ్యాలవాడ' : పిసిసి

ప్రజాశక్తి - వేంపల్లె

సిపాయిల తిరుగుబాటుకు 10 ఏళ్ల ముందే ఆంగ్లేయుల దుష్టపాలనపై తిరుగుబాటు చేసి, వీరమరణం పొందిన ప్రథమ స్వాతంత్ర్య సమరయోధుడు ఉయ్యాలవాడ నరసింహరెడ్డినని పిసిసి మీడియా చైర్మన్ డాక్టర్ తులసిరెడ్డి కొనియాడారు. శుక్రవారం నరసింహరెడ్డి 217 వ జయంతి, మౌలానా అబ్దుల్ కలాం ఆజాద్ వర్ధంతి సందర్భంగా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో కాంగ్రెస్ నాయకులతో కలిసి ఉయ్యాలవాడ, అజాద్ చిత్ర పటాలకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నరసింహరెడ్డి పోరాట పటిమ, వీరత్వం ప్రతి తెలుగువాడికి, భారతీయుడికి స్ఫూర్తిదాయకమన్నారు. ఉయ్యాలవాడ పోరాట స్ఫూర్తితో ప్రజాస్వామ్య పద్ధతిలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దుష్టపాలనపై పోరాటం సాగించాలని పిలుపునిచ్చారు. దేశతొలి విద్యామంత్రి అబుల్ కలాం ఆజాద్ అసలైన జాతీయవాదని చెప్పారు. హిందూ-ముస్లిం ఐక్యత, కాంగ్రెస్ పార్టీ పటిష్టత, దేశ స్వాతంత్ర్యం కోసం కృషి చేసిన మహనీయుడని చెప్పారు. కార్యక్రమంలో కాంగ్రెస్ సమన్వయ కమిటీ సభ్యులు అమర్నాథరెడ్డి, ఉత్తన్న, బాలం సుబ్బరాయుడు, వేమయ్య, రామకృష్ణ, బద్రీ, వినయ్, రవి పాల్గొన్నారు.

ప్రొద్దుటూరు(పుట్టపర్తి సర్కిల్) : స్వాతంత్ర సమరయోధులు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి అని ఆంధ్రప్రదేశ్ రెడ్డి సంఘం వైఎస్ఆర్ జిల్లా అధ్యక్షులు నారుపల్లె జగన్ మోహన్ రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం ప్రొద్దుటూరు పట్టణంలోని వివేకానంద మార్కెట్ ఎదురుగా ఉన్న ఉయ్యాలవాడ నరసింహారెడ్డి విగ్రహానికి పూలమాలవేసి ఘనంగా నివాళు లర్పించారు. కార్యక్రమంలో ప్రొద్దుటూరు మండల ఉప మండల అధ్యక్షులు, రెడ్డి సంఘం సభ్యులు బొమ్ము లక్ష్మీ పుల్లారెడ్డి, అమ్మిరెడ్డి చిన్న అంకిరెడ్డి, నారుపల్లె లక్ష్మీ నారాయణ రెడ్డి, నారుపల్లె శివ దస్తగిరి రెడ్డి, కె.పరమేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

తడి, పొడి చెత్త డబ్బాలు పంపిణీకి సిద్ధం

ప్రజాశక్తి - సింహాద్రిపురం

మండల వ్యాప్తంగా ప్రజలకు తడి, పొడి చెత్త డబ్బాల పంపిణీకి అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. మండలంలో 9 వేల పైచిలుకు కుటుంబాలు ఉండగా వీరికి తడి, పొడి చెత్తను వేయడానికి అనుగుణంగా బ్లూ , గ్రీన్ రంగులు కలిగిన ప్లాస్టిక్ డబ్బాలను ఇవ్వనున్నారు. చెత్త నుంచి సంపద తయారు చేయాలని లక్ష్యంతో స్వచ్ఛ భారత్ మిషన్ కార్యక్రమంలో ప్రజలకు వీటిని ఇవ్వనున్నారు. ఇప్పటికే ఈ డబ్బాలు ఎంపిడిఒ కార్యాలయానికి చేరాయి. డబ్బాలను త్వరలోనే పంపిణీ చేయ నున్నట్లు ఎంపిడిఒ కృష్ణమూర్తి తెలిపారు.

నేర్చుకున్న అంశాలను విద్యార్థులకు తెలియజేయాలి

ప్రజాశక్తి - వేంపల్లె

శిక్షణ తరగతుల్లో నేర్చుకున్న అంశాలను తరగతి గదుల్లో విద్యార్థులకు తెలియ జేయాలని మండల విద్యాధికారి జాఫర్ సాదక్ కోరారు. శుక్రవారం స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో ఎల్ఐపి కింద రెండు రోజుల పాటు శిక్షణ తరగతులను నిర్వహించారు. ఈ నేపథ్యంలో మండల విద్యాధికారి శిక్షణ తరగతులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఉపాధ్యాయుడూ విద్యార్థికి కనీస అభ్యసన సామర్థ్యాలైనా చదవడం, రాయడంపై అవగాహన చేసుకోవడం, సొంతంగా రాయడం, వంటి వాటిని సాధించేందుకు కృషి చేయాలని కోరారు. నాలుగు రోజులుగా తెలుగు, ఇంగ్లీషు, గణితం, సైన్సు, సోషియల్ వంటి సబ్జెక్టులపై ఉపాధ్యాయులకు ఆర్‌పిలు శిక్షణ ఇస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో కోర్సు డైరెక్టర్ శివమునెమ్మ, కాంప్లెక్స్ హెచ్ఎం నారాయణమ్మ, ఎంఇఒ-2 స్టాలిన్ ఐజాక్, డిఆర్‌పి చెరుకూరు శ్రీనివాసులు, ఉర్దూ హై స్కూల్ హెచ్ఎం ప్రసాద్, ఆర్‌పిలు బాబు, రామచంద్ర, నారాయణ, సుహాసిని, వనజా, రామాంజనేయులు పాల్గొన్నారు.

వైసిపితోనే అభివృద్ధి సాధ్యం

కలసపాడు : సిఎం జగన్‌మోహన్‌రెడ్డితోనే అభివృద్ధి సాధ్యమవుతుందని బద్వేల్ నియోజకవర్గం శాసన సభ్యురాలు డాక్టర్ సుధా తెలిపారు. శుక్రవారం మండలంలో గడపగడప కార్యక్రమం నిర్వహించారు. జగనన్న చేసిన అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. రానున్న ఎన్నికల్లో జగనన్నను తిరిగి అందలం ఎక్కించాలని ఆమె కోరారు. కార్యక్రమంలో కలసపాడు మండల పార్టీ అధ్యక్షుడు, తగిలి సుదర్శన్, జడ్‌పిటిసి అంకన గురివిరెడ్డి, ఎంపిపి నారాయణ, జెఎసి మండల కన్వీనర్ చిత్త రాజశేఖర్‌రెడ్డి, మాజీ మండలాధ్యక్షుడు సుధా, రామకృష్ణారెడ్డి, సింగల్ విండో అధ్యక్షుడు, పురుషోత్తంరెడ్డి, బ్రాహ్మణపల్లి భాస్కర్ రెడ్డి, వాలంటీర్లు సచివాలయ సిబ్బంది అంగన్వాడీ వర్కర్లు బూత్ కన్వీనర్లు, వైసిపి కార్యకర్తలు పాల్గొన్నారు.

అంబేద్కర్ విగ్రహం ఏర్పాటుపై హర్షం

జమ్మలమడుగు రూరల్ : సుప్రీంకోర్టులో అంబేద్కర్ విగ్రహాన్ని ఈనెల 26న ఏర్పాటు చేయడం హర్షించదగ్గ విషయమని ఎస్‌సి, ఎస్‌టి మానిటరింగ్ కమిటీ సభ్యులు మేకల ఆంజనేయులు తెలిపారు. శుక్రవారం సాయంత్రం స్థానిక ఎస్‌సి కాలనీలో అంబేద్కర్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజ్యాంగ దినోత్సవం పురస్కరించుకొని స్వాతంత్ర్యం వచ్చి 76 ఏళ్ల గడిచిన తర్వాత భారత అత్యున్నత న్యాయస్థానమైన సుప్రీంకోర్టులో అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించడం భారతీయులంతా హర్షించదగ్గ విషయమన్నారు. సామాజిక న్యాయ యోధుడైన ఆయన దేశానికి రాజ్యాంగాన్ని అందించిన దిక్సూచి అన్నారు. ఆయన తన చూపుడు వేలుతో సామాజిక న్యాయం, ప్రగతి వైపు పయనించమని ప్రజలకు స్ఫూర్తినిస్తాయని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు కారపాకుల రాజశేఖర్, భాస్కర సుధాకర్, రాజు,సునీల్,చంటి, అరవింద్, వినయ, సూర్య పాల్గొన్నారు.

సమాజ సేవలోనే సంతృప్తి
స్వామి వివేకానంద ఫౌండేషన్ స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకులు పాపిజెన్ని రామకృష్ణారెడ్డి

ప్రజాశక్తి -పోరుమామిళ్ల

సమాజ సేవలోనే సంతృప్తి ఉందని కలసపాడు మండలం తెల్ల పాడు గ్రామానికి చెందిన సమాజ సేవకుడు పాపిజెన్ని రామకృష్ణారెడ్డి పేర్కొన్నారు. ఆయన ప్రజాశక్తితో మాట్లాడుతూ తాను పేదరికంతో పోరాడుతూనే.. కష్టాలతో కలబడుతూనే పెరిగానని చెప్పారు. తన విద్యా భాస్యం కూడా అలానే సాగిందని పేర్కొన్నారు. సమాజంలోని పేదరికం, అసమానతలు, చెడుమార్గం వైపు వెళ్తున్న యువత.. ఇవ్వన్నీ తనను కలత చెందేలా చేశాయన్నారు. ఏదో చేయాలనే తపన ఉందని కానీ, ఏమి చేయాలో తెలియదని, ఇలాంటి పరిస్థితిలో ఒక గురువు వివేకానందుడి భావాలని తెలి యజేసి తనలో స్ఫూర్తిని రగిల్చాడన్నారు. 2010లో స్వామి వివేకానందుడి పేరుపై 2010 జనవరి 12న స్వచ్ఛంధ సంస్థలను ప్రారంభించానని చెప్పారు. తనలాంటి యువకులను పోగు చేసుకుని పాఠశాలలు, కళాశా లలకు వెళ్లి వివేకానందుడి బోధనలను వారికి తెలియ జేయడమేగాక రక్తదానం, సామాజిక బాధ్యత తదితర అంశాలపై విద్యార్థులకు చైతన్యం కల్గిస్తున్నానని చెప్పారు. తలా కొంత డబ్బు సేకరించి విద్యార్థులకు వ్యాస రచన, వక్తృత్వ పోటీలు పెట్టి బహుమతులు ఇచ్చి వారిని సమాజ సేవ వైపు మరల్చే ప్రయ త్నం చేస్తున్నానని తెలిపారు. ఈ క్రమంలోనే తనకు కేంద్ర ప్రభుత్వ సంస్థ అయిన ఇండియన్ రైల్వేస్‌లో చిన్న ఉద్యోగం వచ్చిందని, వచ్చిన జీతంలో సగభాగం సంస్థ ఆధ్వర్యంలో చేసే సేవా కార్యక్రమాలకు కేటాయిస్తున్నానని వెల్లంచారు. రోడ్డు పక్కన పడి ఉన్న అభాగ్యులను ఆదుకోవడం, అనాథ మృతదేహాలకు అంతమ సంస్కారాలు చేయడం వంటి సేవా కార్యక్రమాలు చేస్తున్నానని తెలిపారు. ఒకసారి పోరుమామిళ్ల ప్రభుత్వాస్పత్రి బయట పడి ఉన్న ఒక వ్యక్తి ధీన స్థితిని చూసి, అలాంటి వారి కోసం ఒక ఆశ్రమాన్ని నిర్మించాలని నిర్ణయించుకున్నానని, తన ఆలోచనకు భార్య రామతులసి తోడ్పాటునందించిందని చెప్పారు. అనుకున్నదే తడువుగా కాశినాయన మండలం ఓబుళాపురం గ్రామ సగిలేటి ఒడ్డున ఒక దాత పొలాన్ని ఆశ్ర మానికి విరాళంగా తీసుకున్నానని, ఆత్మీయులు, మాన వతా వాదులు, పెద్దల సహకారంతో ఆహ్లాదకరమైన ప్రాంతంలో ఆశ్ర మాన్ని నెల కొల్పానని తెలి పారు. ఇప్పటికీ ఆశ్రమంలో 115 మంది నిరాశ్ర యులు సేద తీరుతున్నారన్నారు. ఇంకో 30 మందికి ఆశ్రయం ఇవ్వడానికి తాము సిద్ధం గా ఉన్నామని, ఉచితంగా అన్ని వసతులు ఏర్పాటు చేస్తున్నానని తెలిపారు. జీవితం సేవకే అంకితం.. సేవలో లభించే ఆనందమే ఆత్మానందం అంటున్న పాపిజెన్ని రామకృష్ణారెడ్డి చెప్పారు.



నిరాశ్రయులకు నిత్యావసరాలు పంపిణీ చేస్తూ..



అభాగ్యుడికి స్నానం చేయిస్తున్న పాపిజెన్ని



వ్యాధులపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

వ్యాధుల పట్ల జాగ్రత్తగా ఉండాలి

ప్రజాశక్తి - బి. కోడూరు

విద్యార్థులు వ్యాధుల పట్ల జాగ్రత్తగా ఉండాలని పోరుమామిళ్ల మలేరియా సబ్ యూనిట్ అధికారి తక్కోలు నరసింహారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం పట్టణంలోని ప్రభుత్వ పాఠశాల, జూనియ కళాశాలలో అంటువ్యాధులు, వ్యక్తిగత, పరిసరాల శుభ్రత, దోమల లార్వా నియంత్రణ, డెంగీ, మలేరియా, చికున్‌గున్యా, ఫైలేరియా వ్యాధులపై అవగాహన కల్పించారు. పాఠశాల పరిసరాలను శుభ్రం చేయించారు. లార్వా ఉన్న తొట్లు, సంపులు, ఓవర్‌హెడ్ ట్యాంకులను శుభ్రం చేయించాలని పాఠశాల సిబ్బందికి సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు దోమకాటుకు దూరంగా ఉండాలని తెలిపారు. అందుకు తప్పనిసరిగా ా దోమతెరలను వాడాలన్నారు. జ్వరం, తల నొప్పి ఉన్న వారికి ప్రతి బుధ, శనివారాలలో రక్తపు పూతలు తీసి ల్యాబ్ కు పంపాలని సూచించారు. సీజనల్ వ్యాధుల పట్ల జాగ్రత్తగా ఉండాలని చెప్పారు. కార్యక్రమంలో స్కూల్, జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ శ్రీ బషీర్ బాషా, ఉపాధ్యాయులు, హెల్త్ సూపర్‌వైజర్ జాన్ విలియం, కె. కుమారి, ఆశీర్వాదమ్మ, ఆశా కార్యకర్త, వైద్య సిబ్బంది ఆశా కార్యకర్తలు విద్యార్థులు పాల్గొన్నారు.

చదువుతోపాటు క్రీడలూ ముఖ్యం

ప్రజాశక్తి-పోరుమామిళ్ల

విద్యార్థులకు చదువుతోపాటు మానసిక ఉల్లాసం కోసం క్రీడలు, ఎంతో అవసరమని హోలీ రోజరీ ఇంగ్లీష్ మీడియం పాఠశాల ప్రిన్సిపల్ ఫాదర్ సగిలి జైపాల్ తెలిపారు. శుక్రవారం విద్యార్థుల ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ, విద్యార్థులు పాఠశాల స్థాయి నుంచి క్రమశిక్షణ , ఓర్పు, సహనం, పట్టుదల, కలిగి ఉపాధ్యాయులు చెప్పిన ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా అర్థం చేసుకొని ముందుకు వెళ్లినప్పుడు దేనినైనా సాధించవచ్చని చెప్పారు. ఈనెల 18 ,19 తేదీల్లో తెనాలిలో నిర్వహించిన రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ తేక్వాండో బాయ్స్ విభాగంలో షేక్ అబూబకర్ తనదైన శైలిలో ప్రతిభను చూపి డిసెంబర్ 1, 2, 3 తేదీలలో డెహ్రాడూన్ లో నిర్వహించే జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యాడని తెలిపారు. ఎంపికైన విద్యార్థిని, వ్యాయామ ఉపాధ్యాయుడు వై.గోవర్ధన్‌ను పాఠశాల ప్రిన్సిపల్ అభినందించారు.



విద్యార్థిని అభినందిస్తున్న ప్రిన్సిపల్

మైదుకూరులో సిసి కెమెరాలు పునరుద్ధరణ

చాపాడు : మైదుకూరు పట్టణంలో ప్రజారక్షణ, భద్రతలో కీలకమైన సిసి కెమెరాలు మరమ్మతుకు గురికావడంతో పట్టణ సిఐ మస్తాన్, ఎస్ఐ మద్దిలేటి చొరవతో మరమ్మతులు చేసి పునరుద్ధరించారు. సిసి కెమెరాలు పునరుద్ధరించి కంట్రోల్ రూమ్‌కు అనుసంధానం చేశారు. శ్రీకృష్ణదేవరాయ కూడలి, బైపాస్ రోడ్డు , కడప రోడ్డు, బద్వేల్ రోడ్డులో ఏర్పాటు చేసిన సిఇస కెమెరాలు అన్నింటిని పునరుద్ధరించారు. దీంతో మైదుకూరు పట్టణంలో దొంగతనాలకు, నేరాలకు అడ్డుకట్ట వేసినట్లు అవుతుందని స్థానిక ప్రజల హర్షం వ్యక్తం చేశారు. నేరాల నియంత్రణకు ఇససి కెమెరాలు కీలకమని షాపుల యజమానులు ,ప్రజలు తమ నివాసాలకు ఏర్పాటు చేసుకోవాలని పోలీసులు విజ్ఞప్తి చేశారు.



సోషల్ ఆడిట్‌లో మాట్లాడుతున్న ఉపాధి పీడీ యధుభూషణ్‌రెడ్డి

అవకతవకలకు పాల్పడితే చర్యలు

ప్రజాశక్తి - వల్లూరు

ఉపాధి హామీ చట్టం కింద వ మండలంలో జరుగుతున్న పనులలో ఎలాంటి అవకతవకలకు పాల్పడకుండా సజావుగా నిర్వహించుకోవాలని జిల్లా ఉపాధి హామీ పథకం ప్రాజెక్టు డైరెక్టర్ యధుభూషణ్‌రెడ్డి అన్నారు. శుక్రవారం వల్లూరు మండల కేంద్రంలో ఉపాధి హామీ పథకం సోషల్ ఆడిట్ నిర్వహించారు. మండలంలో నిర్వహించిన ఉపాధి పనులలో ఆడిట్ నివేదికలను ఓపెన్ ఫోరంలో సిబ్బంది అధికారులకు వివరించారు. పొరపాటులలో భాగంగా రూ. 11616 లను రికవరీకి ఆదేశించారు. కార్యక్రమంలో అడిషనల్ పీడీ నాగరత్నమ్మ, డిడబ్ల్యూఎంఎ డివిఒ వెంకటనారాయణ, యోగాంజనేయరెడ్డి, కమలాపురం ఏపీ డి సోమశేఖర్‌రెడ్డి, సాంబశివరెడ్డి, ఎంపిడిఒ జయశ్రీ, ఏపీవో సుధారాణి, పార్థసారథి, ఇసి అన్నానాయక్, అంజలి ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

తవ్విన మట్టిని తొలగించాలి

వేంపల్లె : పట్టణంలోని పులివెందుల రోడ్డు వెడల్పులో భాగంగా డ్రెయినేజీ కాల్వ కోసం పనుల కోసం తవ్విన మట్టిని వెంటనే తొలగించాలని టిడిపి నాయకులు జయచంద్రారెడ్డి, వెంకటసుబ్బారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం వారు విలేకరులతో మాట్లాడుతూ తవ్విన మట్టిని రోడ్డు ప్రక్కనే వేయడం వల్ల వాహనాదారులు , ప్రజలు చాలా ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. పులివెందుల రోడ్డులో డ్రెయినేజీ కాలువ పనులు జరుగుతుండడంతో కాలువల్లో ఉన్న మురికి నీరు కూడ రోడ్డుపై ప్రవహిస్తున్నాయని తెలిపారు. అ మురికి నీటిలోనే ప్రజలు, వాహనదారులు, బస్సులు వెళ్లే పరిస్థితి నెలకొంది అన్నారు. పనులు జరిగే సమయంలో ప్రమాదం జరగకుండా ఉండేందుకు సూచిక బోర్డులు కూడ పెట్టలేదని చెప్పారు. కాంట్రాక్టర్లు ప్రజల, ప్రయాణికుల, వాహనదారుల ఇబ్బందులు గుర్తించి పనులు చేయాలని, అలాంటి చర్యలు చేపట్టక పోవడం దారుణమని అన్నారు. పనులు త్వరిత గతిన పూర్తి చేసి దుకాణదారులకు, ప్రజలకు ఇబ్బందులు లేకుండా చేయాలని కోరారు.